
# పరిష్కారం మీరే చెప్పండి!

గుడిసేవ సుందరరామయ్య



ఒకటో నంబరు ప్లాట్ ఫారమ్మీద నుంచి కోరమండల్ మెల్లగా కదిలింది.

రైలు కదలగానే ప్లాట్ ఫారంమ్మీదవున్న జనం ఒక్కొక్కరే ఇంటిముఖం పట్టసాగారు. నేను ఇంగ్లీషు నవల ఒకటి కొనుక్కొందావని బుక్‌స్టాల్ దగ్గరకు వెళ్లాను. అక్కడ షో కేసులో పెట్టిన నవలను పరిశీలించసాగాను. అంతలో "ఎక్స్‌క్యూజ్ మి!" అన్న కంఠం విన్పించింది వెనక్కి తిరిగి చూశాను.

పాతికేళ్ళ యువతి చేతిలో వేనిటీ బ్యాగ్ వుంది. చామనచాయ అయినా ముఖం ఆకర్షణీయంగా వుంది చెవులకు వ్రేలాడుతున్న రింగులు, నుదిటిమీద మెరుస్తున్న దోస గింజంత బొట్టు, గాలికి అల్లల్లాడే ముంగురులు, కోటేరులాంటి ముక్కు చూపరులను మరింత ఆకర్షిస్తున్నాయి. ఆమె అందాన్ని చూస్తూ అలానే నిలబడి పోయిన నన్ను "ఓ క్షణం యిలా వస్తారా?" అని ప్రక్కకు పిల్చింది. వెళ్లాను.

"నాకో హెల్ప్ చేస్తారా?"

"ఏమిటి?"

"ఓ ప్లాట్‌ఫామ్ టిక్కెట్ తెచ్చి పెడ్తారా?"

"మీరు కోరమండల్‌కే వచ్చారా?"

"అవును!"

"మరి టిక్కెట్ కొనలేదా?"

"ప్లీజ్! వివరాలు తర్వాత చెప్తాను. నాకీ హెల్ప్ చేయండి!"

"ఓ కె"

బయటకువెళ్లి టిక్కెట్ తెచ్చి ఆమె కిచ్చాను.

"థాంక్సండీ!" అంటూ బ్యాగ్ తెరచి డబ్బులివ్వబోయింది అక్కర్లేదన్నాను.

"థాంక్స్!" అంది నావైపు చిత్రంగా చూస్తూ.

"స్టేషను బయటికి దారి చూపిస్తారా?"

"రండి!" అంటూ మెల్లగా అడుగులు వేశాము.

ఆమె నా వెనుకే నడిచింది.

"వైజాగ్ రావటం మీకు కొత్తా?"

"అవునండి! ఇదే ఫస్ట్ టైమ్!"

ప్లాట్ ఫారమ్ టిక్కెట్టు టి. సి. చేతిలో వుంచి యిద్దరం బయటకు వచ్చాం.

"మీ రెక్కడకు వెళ్లాలి?" అని అడిగాను ఆటోవైపు నడుస్తూ.

"ఇంకా నిర్ణయించుకోలేదు!"

ఆ మాట వినగానే అదిరిపడ్డాను. టిక్కెట్టు లేకుండా ప్రయాణం చేసి వచ్చిందని తెల్సినప్పట్నుంచీ ఆమె వ్యక్తిత్వాన్ని గురించి ఆలోచిస్తూనే వున్నాను. ఇప్పుడు ఆమె నోటి నుండి వెలువడ్డ మాట వినగానే నేను ఆమెకు అనవసరంగా సాయపడ్తున్నానేమో! అన్పించింది.

"ఏ ఉద్దేశం లేకుండానే మీ రిక్కడకు వచ్చారా?"

ఆమె సమాధానం చెప్పలేదు.

నేను మళ్లీ అడిగాను "టిక్కెట్ కొనకుండా ప్రయాణం చేయాల్సిన అగత్యం మీకెందుకు కల్గింది?"

"ఒక్కోసారి పరిస్థితుల ప్రభావం చేత మనకు యిష్టంలేని పనులు కూడా చేయాల్సివస్తుందండి!"

"నీవు రచయిత్రివైతే బాగా షైన్ అయ్యేదానివి!" అని మనసులోనే అనుకొని

దీర్ఘ వ్యాధులకు ఉత్తమ వైద్యం
దురభ్యాసములకు లోనై, దాంపత్యసౌఖ్యం పొందలేనివారికి హెర్నియా, చర్మవ్యాధులకు పోస్టు ద్వారా వరి బీజం(బుడ్డ) ఇస్నోఫీలియా ఉబ్బసం (దమ్ము) జీర్ణాశయ(గ్యాస్ట్రిక్) మూత్ర,స్త్రీల వ్యాధులకు ఆపరేషన్ లేకుండా చికిత్స చేయబడును. రండి
డా॥ దేవర
3/1 బ్రాడీపేట, గుంటూరు. (A.P.)










# పరిష్కారం మీరే చెప్పండి!

"ప్రస్తుతం మీరేం చేయ లనుకుంటు న్నారు?" అని అడిగాను.

"మీరెలా సలహా యిస్తే అలాచేస్తాను!"

'నేను సలహా యివ్వటమా? నేనేమైనా ఆమె స్నేహితుణ్ణా? బంధువునా?'

"ఈ వూరు నాకు కొత్తండి. పైగా రాత్రి సమయం. ఒంటరిగా వెళ్లాలంటే ఎందుకో భయంగా వుంది!"

"మీరు ఒంటరిగా వెళ్ళాల్సిన అవసరం లేదు మీరు అడ్రస్ చెబితే నేను కూడా వెంటవచ్చి మీరు వెళ్ళాల్సిన చోటుకు పంపిస్తాను!"

"నేను చెప్పిన చోటుకు తీసుకు వెళ్తారా?"

"తప్పకుండా!"

"మాట తప్పరుగా!"!

లేదన్నట్లు తలూపాను.

"మీ యింటికి తీసుకువెళ్లండి!"

నెత్తిమీద బాంబు పడ్డట్లయింది.

పేరు వూరు తెలియని పరాయి ఆడ పిల్లను ఈ రాత్రి సమయ లో మా యింటికి తీసుకు వెళ్ళటమా? ఇది సంభవమా? ఎందు క్కాదు! అంతా నా చేతుల్లోనే వుంది. నాతో రావటానికి ఆమె భయపడనప్పుడు ఆమెను తీసుకు వెళ్లటానికి నే నెందుకు భయపడాలి?

ఆటోని పిల్చి "కూర్చోండి!" అన్నాను.

ఆమె చటుక్కున ఆటో ఎక్కి ఓ ప్రక్కగా ఒదిగి కూర్చుని 'మీరు కూడా రండి!' అన్నట్లుగా నా వైపు చూసింది.

"వన్ మినిట్!" అంటూ నేను పార్కింగ్ స్థలానికి వెళ్లి స్కూటర్ స్టార్ట్ చేశాను.

స్కూటర్ వెనుకే ఆటో వచ్చింది.

ఇల్లు రాగానే స్కూటర్ ఆపాను.

జేబులోంచి డబ్బులు తీసి ఆటోవాణ్ణి పంపించాను.

ఆమె చుట్టు ప్రక్కలమ పరిశీలనగా చూస్తూంది.

నేను కీ చైన్ బయటకు తీసి తాళం తీశాను.

"లోపలికి రండి!" అన్నాను వరండాలో లైటు వేసి.

ఆ అమ్మాయి లోపలికి వచ్చింది.

"కూర్చోండి!" అన్నాను.

సోఫామీద కూర్చుని గోడలకు తగిలించి వున్న ఫోటోలను, క్యాలెండర్లను పరీక్షగా చూస్తూండిపోయింది.

"ఇప్పుడు చెప్పండి! మీ పేరేమిటి? మీ దేవూరు? మీ రాకకు కారణ మేమిటి?" ప్రశ్నలన్నీ ఒకేసారి అడిగేను.

ఆ అమ్మాయి ఉలిక్కి పడింది.

తల వంచుకొని నేల చూపులు చూస్తూ మెల్లగా పెదాలు విప్పింది. "నా పేరు జ్యోతి. మాది విజయవాడ నేను టెన్త్ పాసయ్యాను. మా నాన్న రైల్వేలో పని చేస్తారు. మా అమ్మ పోయాక రెండో పెళ్లి చేసుకొన్నారు. మా పిన్ని పెట్టే బాధలు భరించలేక ఇలా పారిపోయి వచ్చాను."

ఆమె కథ అర్థమైంది. ఇప్పటి వరకు ఆమె ఎటువంటిదోనని నా మనసు లో ఏర్పడిన భయం పన్నగిల్లింది. ఆమె పట్ల జాలి, సానుభూతి కల్గాయి ఈ పరిస్థితుల్లో నేను ధైర్యం చేసి ఇక్కడకు తీసుకురావటమే మంచిదన్పించింది. ఆపదలోవున్న అమ్మాయిని ఆదుకొంటున్నానన్న తృప్తి నాకు కల్గింది.

"ఇల్లు వదలి రావటంలో మీరు తొందర పడ్డారేమో?'!

"లేదండి! ఈ నిర్ణయం చాలా ఆలస్యంగా తీసుకొన్నాను!"

"మీ నాన్నగారికి మీరంటే యిష్టం లేదా?"

"చిన్నప్పుడు బాగానే చూసేవారు. కాని పిన్ని వచ్చాక నామీద లేనిపోనివి కల్పించి నాన్న మనసుని వికలం చేసింది."

"మీ అమ్మ తరపువారు లేరా?"

"వాళ్లంటే నాకే దుస్థితి కల్గేది కాదండి!"

"మీ పరిస్థితికి నేనెంతో విచారిస్తున్నాను. భవిష్యత్తులో ఏం చేయాలను కొంటున్నారు?"

"ఉద్యోగం!"

"టైప్, షార్ట్‌హ్యాండ్ వచ్చా?"

"లేదండి!"

"పోస్టు గ్రాడ్యుయేట్స్‌క్కూడా ఉద్యోగాలు దొరకని రోజులివి! మరి మీకు వెంటనే వుద్యోగం దొరుకుతుందని ఎలా అనుకొన్నారు?"

"దొరుకుతుందన్న ఆశతోనే ఇల్లువదిలి వచ్చానండి! నా వెంట నా సర్టిఫికెట్లను కూడా తెచ్చుకున్నాను!"

"మీ ఆత్మ విశ్వాసాన్ని అభినందిస్తున్నాను!"

"థాంక్స్!"

"మీకు ఆకలిగా వుందా?"

"లేదండీ!" అంది మొహమాట పడుతూ.

"బాత్‌రూమ్ లోపల వుంది. మొహం కడుక్కురండి!" అన్నాను టవల్ అందిస్తూ.

భోజనం చేస్తూ అడిగింది "ఇంట్లో మీ రొక్కరే వుంటున్నారా?" అని.

"ప్రస్తుతం నేను ఒక్కణ్ణే! మాఅమ్మను చెల్లాయి కలకత్తా తీసుకువెళ్లింది. వాళ్లను రైలెక్కించటానికే నేను స్టేషనుకు వచ్చాను!"

"మీరు బాచిలరా?"

అవునన్నట్లు తలూపాను.

"మీ నాన్నగారు రైల్వేలో ఏం పని చేస్తున్నారు? ఆఫీసు ఎక్కడ? పేరేమిటి?"

అన్నిటికీ సమాధానాలు చెప్పింది.

మనసులోనే నోట్ చేసుకొన్నాను.

భోజనాలు అయ్యాక పళ్లాలు తనే కడగబోయింది మర్నాడు పనిమనిషి వచ్చి కడుగుతుందని చెప్పినా విన్పించుకోలేదు. "నేనూ ఆడపిల్లనేనండి! ఈ పనిచేస్తే తప్పేమీ లేదు!" అంటూ గబగబా పళ్ళాలు శుభ్రపరచి అల్మారాలో పెట్టింది. భోజనాలయ్యాక స్కూటర్‌ని వరండాలో పెట్టాను.

"అలా బయటకు వెళ్దాం. వస్తారా?" అని అడిగాను.

"ఎక్కడికి?"

"మా పిన్నిగారింటికి!"

"అక్కడికెందుకు?"

"ఈ రాత్రికి వాళ్ళింట్లో పడుకొందురు గాని. అక్కడ, పిన్ని బాబాయి, యిద్దరు చెల్లాయిలు వున్నారు మీకేమీ భయం వుండదు."

"ఇక్కడ నాకు భయమంటారా?" అదో రకంగా నవ్వింది.

"మిస్ జ్యోతీ! ఈ లోకంలో వున్నది మనం యిద్దరమే అని భ్రమపడకు. మన చుట్టూ సమాజమనే వాచ్‌డాగ్ ఒకటుంది. పెళ్లికాని ఓ ఆడపిల్ల ఓ బ్రహ్మచారితో ఒక రాత్రి ఒకే యింట్లో (వేర్వేరు గదుల్లో ఉన్నా సరే) గడిపినదంటే దానికి ఈ సమాజం ఎలాంటి భాష్యం చెబుతుందో మీకు తెల్సు!


యన్.టి.ఆర్.
రాజకీయాల పరిశీలన
నటరత్న: మక్కళ్ తిలకం: రామాయణంలో పిడకల వేట
రచన: నాటి "ఆంధ్రప్రభ శాస్త్రి"
ఇందులో ఇంకా....
తెలుగువారి తెగులు: నటరత్న నాటకీయత: తిరపతిరభస
1/4 క్రౌన్ సైజు 40 పేజీలు
ధర 3/-లు
★ ఏడికాపీకి అదనంగా రు. 3-50 రిజిస్టర్డు పోస్టేజీకింద పంపాలి. అంటే మొత్తం రు. 6-50 పంపనిదే కాపీ పంపజాలము.
★ పది పుస్తకాల పైనుంచి 25% డిస్కౌంట్. రవాణా చార్జీలు ఆర్డరు పంపినవారే భరించాలి.
★ 50 కాపీల పైబడిన ఆర్డర్లకు లారీ సర్వీసులలో రవాణా చార్జీలు మేమే భరించి పంపగలము.
★ సొమ్ము ముందుగా అందనిదే ఏ ఆర్డరు అంగీకరించబడదు.
For details please contact
Cards Crafts Classics
8 State Bank Street
P.B. No. 2421 Madras 2
Phone: 85029 & 83792

## పవిత్ర రుద్రాక్ష

1 నుండి 14 ముఖములుగల పవిత్ర రుద్రాక్షలు, చందనం తులసి పసుపుపచ్చ మరియు గులాబిరంగుల జపమాలలు, శిలాజిత్తు, గోరోచనం, దక్షిణావర్త శంఖము, అదృష్టమును కల్పించే శ్రేష్ఠమైన రాళ్ళు, లభించును. కోరినవారికి ధరలపట్టి పంపబడును. హిందీ లేక ఇంగ్లీషులో వ్రాయండి.

**Shree Jagdamba Bhawan (A. M.)** SONEPAT-131001.



ప్రతి బుధవారం

ఆంధ్రపత్రిక దినపత్రికలో

## "విపణి వీధి"

ప్రకటనలకాలమ్‌లో మీ వ్యాపార ప్రకటనలివ్వండి కాలమ్ సెం.మీ. రు. 7 మాత్రమే.

వివరాలకు :

అడ్వర్టయిజుమెంటు మేనేజరు,

ఆంధ్రపత్రిక, విజయవాడ-3.





నూతనయవ్వనం పొందండి. సంతానవంతులుకండి/చర్మవ్యాధులనుండివిముక్తులుకండి హస్తప్రయోగమువలనకలుగు నరముల బలహీనత,శీఘ్రస్ఖలనము,అంగముచిన్నదగుట లవసరకాలమందు అసంతృప్తి,సంతానము లేకపోవుట,సమస్తచర్మవ్యాధులకు అద్భుత చికిత్స.పోస్టుద్వారా చికిత్సకలదుప్రతి ఆదివారము భీమవరంషణ్ముఖలాడ్జి నందు ఉ.9నుండి సా.6-30వరకు క్యాంపుకలదు

**డా॥డి.మార్కండేయులు**

ఆయుర్వేదభిషక్, సెక్స్ అండ్ స్కిన్ స్పెషలిస్టు, పార్కురోడ్డు, గుడివాడ,521301, ఫోన్స్ 522 & 540


## పరిష్కారం మీరే చెప్పండి!

వేలెత్తి చూపించే అవకాశం ఈ సమాజానికి ఇవ్వటం నా కిష్టంలేదు. స్కూటర్ వున్నప్పటికీ మిమ్మల్ని స్టేషన్ నుంచి ఆటోలో తీసుకువచ్చాను. నా స్కూటర్ మీద రావటానికి మీకు అభ్యంతరం లేక పోయినా మనిద్దరం స్కూటర్ మీద కల్సి వస్తే ఈ సమాజానికి అభ్యంతరం! అన్నా చెల్లెలు కల్సి వెళ్తుంటేనే అక్రమసంబంధం అంటకట్టే ఈ సమాజం దృష్టిలో పడటం మనకు మంచిది కాదు!'' అంటూ బయటకు వచ్చాను.

ఇంటికి తాళంవేసి ఇద్దరం టి. యస్. ఎన్. కాలనీవైపు నడిచాము.

* * *

మర్నాడు ఉదయం నేను టూత్‌బ్రష్ నోట్లో పెట్టుకొని బాత్‌రూమ్‌లోకి వెళ్తుండగా తలుపు కొట్టిన శబ్దం విన్పించింది.

వరండాలోకి వచ్చి తలుపు తీశాను.

ఎదురుగా జ్యోతి, ఆమె ప్రక్కనే మా పిన్ని కూతురు లక్ష్మి.

''ఉదయాన్నే తీసుకువచ్చావేమిటమ్మా? మొహం కడుక్కొని మీ యింటికి వస్తానని పిన్నికి చెప్పివచ్చానుగా!'' అన్నాను లక్ష్మితో.

''ఏమో అన్నయ్యా! అమ్మ ఎంత నచ్చజెప్పినా వినకుండా జ్యోతిగారు నన్ను తొందరపెట్టి తీసుకు వచ్చారు!''

పిన్నిగారింట్లో ఏమీ ఇబ్బంది వుండదు. ఈమెగారికి కావాల్సిన సౌకర్యాలన్నీ పిన్ని ఎంతో ఓర్పుతో ఏర్పాటు చేస్తుందని నాకు తెల్సు! కాని ఇంతలోనే ఈమె మా యింటికి ఎందుకు వచ్చేసిందో అంతుపట్టలేదు.

సూటిగా ఆమె కళ్లల్లోకి చూశాను.

ఆమె కళ్లు కాంతి దీపికలై వెల్గుతున్నాయి. ఆ కళ్లల్లో అంతులేని ఆరాధన, అవ్యక్తమైన అనురాగం తొంగి చూస్తున్నాయి.

''లోపలికి వచ్చి కూర్చోండి!'' అని అనగానే ఇద్దరూ లోపలికి వచ్చారు.

''మిమ్మల్ని కల్సుకొన్నందుకు నా కెంతో ఆనందంగా వుందండి!'' అంది జ్యోతి సోఫాలో కూర్చుంటూ.

గతరాత్రి ఆ డైలాగ్ అని వుంటే ఆశ్చర్యంలేదు కాని ఈ రోజు ఆమె అలా

## పండగరోజు

జాతికి జాగ్రుతి కలిగినరోజు
మువ్వన్నె పతాకం వెలిగినరోజు
తరతరాల దోపిడి పాలకులు
మూటాముల్లె సర్దినరోజు.

ఆకలిమంటల నంతంచేసి
పేదల బ్రతుకుల నుద్ధరించుటకు
పర్వులు ప్రతినల పూనెడు రోజు
స్వతంత్ర దినమే జాతికి పండగ
సుందర భరితకు నందన సౌధం
సమతా మమతల సామ్యజగతిలో
ప్రజావళి కన్నీటిని తుడిచెడురోజు

మతాలు మనసుల పొరపొలుకొని
కులాలు మనకు కూడు పెట్టవని
ప్రాంతీయతలే పనికి రానివని
ప్రజాస్వామ్యమే మనసు గమ్యమని
తలచిన వలచిన పండగరోజు.

– ఎస్. జ్ఞానేశ్వరి.

అన్నదంటే అందుక్కారణం నా గురించి ఆమెకు మరికొంత సమాచారం తెల్సిందన్న మాట!

''రాత్రి మాటల సందర్భంలో మీ పిన్నిగారు చెప్పారు. మీరు ప్రఖ్యాత కథా రచయిత ఆనందరావ్‌గారని. మీ కథలంటే నా కెంతో యిష్టం. ప్రస్తుత సమాజంలో సగటు మనుషులు ఎదుర్కొంటున్న సమస్యలు, ముఖ్యంగా ఆడవాళ్లు ఎదుర్కొంటున్న సమస్యలను కూలంకషంగా చర్చించి వాటికి పరిష్కార మార్గాలను సూచించే మీ కథలు నన్నెంతో ఆకట్టుకున్నాయి. నిజం చెప్పాలంటే ఇల్లు వదలి వుద్యోగం కోసం నేనిలా రావటానికి కావాల్సిన ధైర్యసాహసాలు మీ కథలు చదవటం వల్లనే కల్గాయి. నా జీవితానికి ఓ దారి చూపబోతున్న వ్యక్తి నా అభిమాన రచయితేనన్న విషయం తెలియగానే మిమ్మల్ని చూడాలని తొందరపడి వచ్చేశాను'' అంది జ్యోతి మెరిసే కళ్లతో.

''థాంక్స్!'' అన్నాను చిరునవ్వుతో.

''మా పిన్నికి నవలలంటే చాలాయిష్టం. అందుకనే చాలా తెలుగు పత్రికలు తెప్పించేది నేను మాత్రం కథలే చదివేదాన్ని ముఖ్యంగా మీరు రాసిన కథలు. ఈ మధ్య మూడు

నె ఋగా పుస్తకాలు తెప్పించటం మానేసింది పిన్ని. కొత్తగా ప్రచురించిన మీ కథలేవైనా వుంటే యివ్వండి. చదువుతాను!" అంది జ్యోతి

నేను లోపలికి వెళ్ళి అల్మారా తీసి అందులో వున్న నా కథల ఆల్బమ్‌ను జ్యోతి కిచ్చాను.

ముఖం కడుక్కుని మరో పదినిమిషాల్లో బట్టలు వేసుకొని వరండాలోకి వచ్చాను.

జ్యోతి, లక్ష్మి ఎంతో ఉత్సాహంగా ఆల్బమ్‌లోని పేజీలు త్రిప్పుతున్నారు.

"ఆ కథలు తర్వాత చదువుకోవచ్చు. అవతల పిన్ని టిఫిన్ రెడీచేసి మనకోసం ఎదురుచూస్తూ వుంటుంది. వెళ్దాం పదండి!" అన్నాను.

లక్ష్మి, జ్యోతి లేచి నిలబడ్డారు.

"మీ రిద్దరూ నడుస్తూ వుండండి, నేను స్కూటర్ మీద వస్తాను!" అన్నాను.

వాళ్ళిద్దరూ రోడ్డుమీది కెళ్ళారు.

నేను ఇల్లు తాళంవేసి స్కూటర్‌ను స్టార్ట్‌చేశాను. పిన్ని వాళ్ళింట్లో టిఫిన్ పూర్తిచేసి ఆఫీసుకు బయల్దేరాను. గుమ్మం దాకా వచ్చి గుర్తు చేసింది జ్యోతి "నా వుద్యోగ విషయం మర్చిపోకండి!"

"అలాగే!"

* * *

సాయంత్రం నేను ఆఫీసు నుంచి సరాసరి పిన్నిగారింటికే వెళ్ళాను.

నేను వెళ్ళేసరికి జ్యోతి ఎంతో ఆశతో ఎదురు వచ్చింది.

"జాబ్ విషయం మాట్లాడాను. రాజమండ్రిలో మా బ్రాంచ్ ఆఫీసు వుంది, ప్రస్తుతం అక్కడ ఓ టెంపరరీ వేకన్సీ వుంది.. మీ కిష్టమైతే రేపే వెళ్దాం!" అన్నాను.

"చాలా థాంక్సండీ!" అంది జ్యోతి కృతజ్ఞతగా.

* * *

రాజమండ్రిలో రైలు ఆగింది.

నేను దిగగానే నా వెనుకే జ్యోతి దిగింది.

ఇద్దరం ప్లాట్‌ఫారమ్మీద ఓ ప్రక్కగా వెళ్ళి నిలబడ్డాం?

అంతలో ఓ ఏభైయేళ్ళ వ్యక్తి గబ గబ అడుగులు వేసుకొంటూ మా దగ్గరకు వచ్చాడు.

జ్యోతిని ఆప్యాయంగా తలనిమిరి దగ్గరకు తీసుకొన్నాడు.

"మీకు చాలా థాంక్సండీ ఆనందరావ్ గారూ! అమ్మాయి ఎక్కడికి వెళ్ళిందా అని ఎంతో కంగారు పడ్డాను మీ వద్ద నుంచి ఫోన్ వచ్చాక మనసు కుదుటపడింది. మా జ్యోతిని మాకు అప్పజెప్పారు. మీ ఋణం ఎలా తీర్చుకోవాలో తెలియటంలేదు..."

"నో మెన్షన్!" అంటూ జ్యోతి ముఖంలోకి చూశాను.

ఆమె ముఖంలో జ్వాలలు రగుల్తున్నాయి.

అంతకు ముందున్న అభిమానం, ఆప్యాయత ఆ క్రోధాగ్నిలో బూడిదయ్యాయి.

ఆమె చూపులను తట్టుకోలేక స్టేషన్లోంచి వెంటనే బయటకు వచ్చేశాను.

* * *

మూడ్రోజుల అనంతరం—

నేను ఆఫీసు నుంచి రాగానే వరండాలో ఓ కవరు కన్పించింది.


ఫ్రమ్ అడ్రస్ చూశాను.

జ్యోతి పేరు కన్పించింది.

ఆత్రంగా విప్పాను.

'రచయిత ఆనందరావ్ గార్కి నమస్సులు! నా దగ్గర్నుంచి ఉత్తరం వస్తుందని మీరు వూహించి వుండరు. కాని ఒక్కొక్కప్పుడు మనం ఊహించని సంఘటనలే జరుగుతుంటాయి. మీరు రాజమండ్రిలో వుద్యోగం యిప్పిస్తానంటే నిజమే ననుకొన్నాను. కాని మీరు ఆ ఉదయాన్నే మా నాన్నకు ఫోన్ చేసి మాట్లాడారనికాని, నన్నురిసీవ్‌చేసుకొనేందుకు రాజమండ్రి స్టేషన్‌కు రమ్మనమని సలహా యిచ్చారని కాని నాకు తెలీదు. సమస్యల వలయంలోంచి బయట పడ్డానని నేను భావిస్తున్న తరుణంలో మళ్ళీ నన్ను ఆ విషవలయంలోకి నెట్టివేశారు.

రచయితగా మీకీ సంఘంలో పేరువుంది. మీ పాఠకుల హృదయాలలో మీకు అత్యున్నత స్థానం వుంది అందరిలానే మీ కథలు చదివి మీ ఆదర్శాలకు, అభ్యుదయ భావాలకు మనసులో నివాళులు అర్పించాను. అపరిచిత వ్యక్తిగా మీరు వాల్తేర్ స్టేషన్లో కన్పించినపుడు సంస్కారమున్న వ్యక్తిగా మిమ్మల్ని గుర్తించాను. మీరే నా అభిమాన రచయిత అన్న నిజం తెల్సినప్పుడు నేనెంతో ఆనందించాను నాకో దారి చూపిస్తారని నా కష్టాలన్నీ తీరిపోతాయని ఆశపడ్డాను. కాని అక్షరాల్లో చూపించే ఆదర్శం, అభ్యుదయం మీ ఆచరణలో లేదన్న యదార్థం ఇప్పుడు అర్థమైంది. ఎలాంటి విపత్తు వచ్చినా





# ధర్మపథం

బులుసు వేంకటరమణయ్య

## హనుమంతుని రామభక్తి

**అం**దరు దేవతలూ భగవంతుని రూపాంతరాలే అయినా ఒక్కొక్కరికీ ఒక్కరిపయి ప్రగాఢమైన భక్తి ఉంటుంది. ఇలువేల్పుకున్న గౌరవం, భక్తి యితర దేవతల పట్ల ఉండదు. శివుడు ఇలువేల్పయినవారికి విష్ణువు మున్నగువారు ముఖ్యులు కారు. రామ భక్తులకు ఇతర దేవతలపై భక్తి లేకపోవడంలో ఆశ్చర్యం లేదు.

హనుమంతుడు గొప్ప రామభక్తుడని అందరికీ తెలియును. అతడు చిరంజీవి కావడం వల్ల అన్ని అవతారాల కాలంలోనూ ఉంటాడు. అది కృష్ణావతారకాలం. ఒకప్పుడు హనుమంతుడు ద్వారకా నగరంలోని ఒక వనంలో ప్రవేశించి చిందరవందరచేస్తూ, అక్కడి ప్రజలకు ఎంతో భయాన్ని కలిగించాడు. అతని సంగతి ఎవ్వరూ ఎరగరు. ఏదో మహాబలశాలి అయిన కోతి అల్లకల్లోలం చేస్తున్నదని కొందరు శ్రీకృష్ణునికి తెలియజేశారు. దానిని పట్టుకోడానికి అతడు కొందరు బలశాలులను పంపాడు—కాని ఆ కోతి ఎవ్వరికీ లొంగలేదు. దాని విజృంభణ అధికమయింది. అప్పుడు శ్రీకృష్ణుడు, ఆ వానరాన్ని తన ఆస్థానానికి తీసుకురావలెనని గరుత్మంతుని పంపెను. భగవదవతారమూర్తి శ్రీకృష్ణుని ఆజ్ఞ అయిందనీ, ఆయన సన్నిధికి రావలెననీ అతడు హనుమంతునికి తెలియజేశాడు – అతడు "శ్రీకృష్ణుడు భగవదవతారం అయితే కానీ, నేను హనుమంతుణ్ణి. శ్రీరాముని ఆజ్ఞను తప్ప మరొకరి ఆజ్ఞను పాటించను" అని నిరాదరణతో అతణ్ణి పంపించేశాడు. తర్వాత శ్రీకృష్ణుడు మరొకర్ని పంపిస్తూ 'శ్రీరాముడే ఆజ్ఞాపిస్తున్నాడు – వెంటనే ఆయన దర్శనానికి రావాలి' అని చెప్పగా హనుమంతుడు వెంటనే సవినయంగా అతని వెంట వెళ్లాడు. శ్రీకృష్ణుడు శ్రీరాముని రూపంతో అతనికి కానవచ్చాడు. హనుమంతుడు ఆయనకు సాష్టాంగ నమస్కారం చేసి, కన్నీటితో ఆయన పాదాలు కడిగాడు. తర్వాత ఆతని ఆజ్ఞ ననుసరించి నగరానికీ, వనానికీ ఎలాటి హానీ కలిగించకుండా అక్కడనుండి వెళ్లిపోయాడు. ★

ఎదుర్కొనేందుకు కావల్సిన ధైర్యం రచయితలకు వుంటుందని నేను అనుకొనేదాన్ని. మిమ్మల్ని చూశాక అదంతా భ్రమని తెల్సింది...

సమాజాన్నిసంస్కరించి అభ్యుదయ పథం వైపు నడిపించాల్సిన బాధ్యత ప్రతి రచయిత మీద వుంటుంది. కాని మీరు ఈ సమాజానికి భయపడుతున్న పిరికివాళ్లు! స్కూటర్ వెనుక ఓ అమ్మాయిని ఇంటికి తీసుకువెళ్తే సమాజం తప్పు పడుతుందని భావించే పిరికివాళ్ళు మీరు! పరాయి ఆడదానితో ఒక రాత్రి గడిపితే సమాజం రాళ్లు రువ్వుతుందని, మీ శీలాన్ని శంకిస్తుందని భయపడ్డారు మీరు. మీరు వ్రాసే కథల్లో ఇలాంటి సంఘటనలే వస్తే మీరు సృష్టించే హీరో పాత్రలు ఎంతో ధైర్యంతో, సంస్కార హృదయంతో సమాజాన్నే ఎదిరించటానికి

## పరిష్కారం మీరే చెప్పండి!

ప్రయత్నిస్తాయి. కాని అవే సంఘటనలు మీ నిజ జీవితంలో సంభవిస్తే పలాయన వాదం ఫాలో అవుతారు. నాకు తెలికుండా మా నాన్నకు ఫోన్‌చేసి నన్ను అప్పగించి మీ సమస్యను పరిష్కరించుకొన్నారు. మీరు స్వార్థపరులు! నేను మిమ్మల్ని కోరింది కేవలం ఆశ్రయం! నా జీవితానికి ఓ మార్గం! అంతే కాని నేను మిమ్మల్ని పెళ్లి చేసుకోమని కోరలేదు కదా! ఎందుకంత భయపడ్డారు?

వారం రోజుల్లో నన్నో ముసలివానికిచ్చి పెళ్లి చేయటానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ పెళ్లి చేసుకోవటం కంటే మృత్యు దేవతను కౌగలించుకోవటమే న్యాయమని తోస్తోంది నాకు. కాని నా మనసులో ఇంకా ఏదో ఆశ సన్నగా మిణుకుమిణుకుమంటూ వెల్గుతూంది. ఆఖరి ప్రయత్నంగా నా అదృష్టాన్ని పరీక్షించుకోటానికి ఈ ఉత్తరం రాస్తున్నాను. నన్ను ఆదుకొనే వ్యక్తి మీరు ఒక్కరే! సమాజానికి భయపడే మీ పిరికితనానికి నా నిండు ప్రాణాన్ని బలి యివ్వమంటారా? లేక, సమాజాన్ని ఎదిరించి నాకో జీవన మార్గాన్ని చూపించే నిజమైన రచయితగా ముందుకు వస్తారా? పరిష్కారం మీరే చెప్పండి?'

—మీ అభిమాని 'జ్యోతి.'

ఉత్తరం జేబులో పెట్టుకొని ఇంటికి తాళంవేసి గబగబ స్టేషన్‌వైపు నడిచాను.

కౌంటర్ దగ్గరకు వెళ్లి పర్సులోంచి మూడు పదులను బయటకు తీసి "ఓ టిక్కెట్టు యివ్వండి" అన్నాను.

"ఎక్కడికి ?"

"విజయవాడ !"